
సాక్షి
వికారాబాద్
బుధవారం । 21 । ఫిబ్రవరి । 2024



ట్రైనింగ్‌కు సర్వం సిద్ధం

పోలీసు ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు రాష్ట్ర వ్యాప్తంగా 28 చోట్ల శిక్షణ కార్యక్రమం ప్రారంభం కానుంది. 8లో▸



‘ఉపాధి’లో సిబ్బంది కొరత

గ్రామాల్లో వలసలను తగ్గించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. 8లో▸



ఓవర్‌లోడ్ !

అధికలోడ్‌తో వెళ్తున్న వాహనాలతో రోడ్లు ధ్వంసమవుతున్నాయి. తాండూరులో అనేక సిమెంట్ కర్మాగారాలు ఉన్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటుదాం

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్



నాగారంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఆనంద్

ధారూరు: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థికి మద్దతు ఇచ్చి గెలిపించుకుందామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని కుమ్మర్‌పల్లి, మైలారం ముందలి తండా, కొత్త తండా, వెనుక తండా, మైలారం గ్రామాల్లో పార్టీ నాయకులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి ఎంపీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలన్నారు. నాగారంలో ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.

గనుల లీజును సులభతరం చేయండి



గనుల శాఖ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

తాండూరు: సంక్షోభంలో ఉన్న నాపరాతి పరిశ్రమను కాపాడాలని తాండూరు క్వారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రాష్ట్ర గనుల శాఖ డైరెక్టర్ సుశీల్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. నగరంలో ఆయన్ను కలిసి సమస్యలను విన్నవించారు. నాపరాతి గనుల లీజు పొందాలంటే ఆర్థిక భారంగా మారిందన్నారు. కర్ణాటక తరహాలో రాయల్టీ పన్నులు ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, ప్రధాన కార్యదర్శి జుబేర్‌లాల, ఉపాధ్యక్షులు ఓం ప్రకాష్ సోమాని, అన్వర్ అహ్మద్, ట్రెజరర్ జైనొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సాబ్.. జరదేఖో

కడా ఏర్పాటుతో కొడంగల్ అభివృద్ధికి ఊతం

- రూ.4వేల కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించనున్న ముఖ్యమంత్రి
- మిగతా నియోజకవర్గాలపై కూడా దృష్టి సారించాలని విన్నపం
- రేవంత్‌రెడ్డి పర్యటనపై జిల్లా ప్రజల్లో గంపెడాశలు

వికారాబాద్: సీఎంగా బాధ్యతలు చేపట్టాక మొదటి సారి సొంత నియోజకవర్గానికి రేవంత్‌రెడ్డి రానున్నారు. బుధవారం ఆయన కొడంగల్ నియోజకవర్గం కోస్గిలో పర్యటించనున్నారు. ఇప్పటికే కడా (కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) ఏర్పాటు చేసి నియోజకవర్గ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా రూ.4వేల కోట్లు మంజూరు చేశారు. రూ.2,700 కోట్లతో ఎత్తిపోతల పథకాలు, మిగతావి రోడ్లు, భవనాలు, కళాశాలలు వంటివి ఉన్నాయి. కోస్గి తోపాటు కొడంగల్ నియోజకవర్గంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులను కోస్గి నుంచే ప్రారంభించనున్నారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

జిల్లా అభివృద్ధిపై ఆశలు

కొడంగల్ తోపాటు జిల్లాలోని అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి పథంలో నడిపించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. అభివృద్ధి పనులను సొంత నియోజకవర్గానికే పరిమితం చేయడంపై జిల్లా ప్రజలు అసంతృప్తి చెందుతున్నారు. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యేలు టీ రామ్మోహన్‌రెడ్డి, బీ మనోహర్‌రెడ్డి సైతం తమ నియోజకవర్గాల అభివృద్ధి విషయంలో సీఎంను ఒప్పించడంలో సఫలం కాలేక పోతున్నారనే వాదన వినిపిస్తోంది. సీఎం తన సొంత నియోజకవర్గం తోపాటు మిగతా నియోజకవర్గాల అభివృద్ధిపై కూడా కనికరించాలని జిల్లా ప్రజ లు కోరుతున్నారు. రేవంత్‌రెడ్డి సీఎం పీఠాన్ని అధిష్ఠించిన నాటి నుంచి జిల్లా అభివృద్ధిపై చర్చ మొదలయ్యింది. సీఎం నోట జిల్లాల పునర్విభజన మాట రావడంతో వికారాబాద్ జిల్లా పునర్విభజన కూడా ఉంటుందనే చర్చ మొదలైంది. ఇదే జరిగితే ఐదు పూర్తి నియోజకవర్గాల పరిధిలోని 30 మండలా లతో కూడిన పెద్ద జిల్లాగా వికారాబాద్ అవతరించడం ఖాయం. అలాగే కొడంగల్ కేంద్రంగా కొత్త రెవెన్యూ డివిజన్ కూడా ఏర్పాటు కానున్నట్లు సమాచారం. అంతేకాకుండా పోలీస్ సబ్ డివిజన్ కూడా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన కనిపిస్తోంది.

జిల్లా ప్రజలు ఆశిస్తున్న పనులు ఇవే..

సీఎం రేవంత్‌రెడ్డి వికారాబాద్‌ను ముందుగా భౌగోళికంగా బలోపేతం చేసి తరువాత అభివృద్ధిపై దృష్టి సారించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అప్పా జంక్షన్ నుంచి చేవెళ్ల, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల మీదుగా హైవే అభివృద్ధి, మహబూబ్‌నగర్ నుంచి పరిగి నియోజకవర్గం గండేడ్, కొడంగల్, తాండూరు నియోజకవర్గాల మీదుగా చించోలి వరకు మరో హైవే పనులు పూర్తి చేయడం, మన్నెగూడ నుంచి వికారాబాద్, అనంతగిరి మీదుగా తాండూరు వరకు నాలుగు లేన్ల రహదారిగా నిర్మాణం, తద్వారా రాష్ట్ర రాజధానికి కనెక్టివిటీని కూడా పెంచాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో షాద్‌నగర్ – పరిగి నాలుగు లేన్ల రహదారిగా అభివృద్ధి చేయడంతో పాటు శంకర్‌పల్లి నుంచి మోమిన్‌పేట మీదుగా మర్పల్లి వరకు రహదారిని నిర్మించడం ద్వారా జిల్లా నలుమూలలకు నగరం నుంచి కనెక్టివిటీ పెరిగి అభివృద్ధికి మరింత ఊతమిచ్చేందుకు దోహదం చేయనుందని జిల్లా ప్రజలు భావిస్తున్నారు. జిల్లా మీదుగా రీజనల్ రింగ్ రోడ్డు కూడా వెళ్లనుండటంతో ఆ చుట్టు పక్కల వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టుల ఏర్పాటు, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటు లాంటి ప్రతిపాదనలు జిల్లా ప్రజలను ఊరిస్తున్నాయి. అనంతగిరిని టూరిజం హబ్‌గా తీర్చి దిద్దడం, పూడూరులో నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటు, మోమిన్‌పేటలో మొబిలిటీ వ్యాలి, నవాబుపేట మండలం ఆర్కతల పరిసరాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు లాంటి పనులకు ఇప్పటికే పునాదులు పడ్డాయి. ఈ పనులను పరుగులు పెట్టిస్తే జిల్లా రూపురేఖలు మారడం ఖాయం. వీటితో పాటు జిల్లా పరిధిలోని నాలుగు మున్సిపాలిటీల్లో అంతర్గత రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, మున్సిపాలిటీల చుట్టు రింగ్ రోడ్లు ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



కొడంగల్: కోస్గిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

పర్యటనకు సర్వం సిద్ధం

- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ నారాయణరెడ్డి

కొడంగల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం కోస్గి పట్టణానికి వస్తున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. వికారాబాద్, నారాయణపేట జిల్లాల కలెక్టర్లు సీ నారాయణ రెడ్డి, కోయ శ్రీహర్ష ఏర్పాట్లను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఇరు జిల్లాల అధికారులను ఆదేశించారు. తొలిసారి సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గానికి వస్తున్నారని, ఆయన రాకకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కోస్గిలో హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. పట్టణంలో ప్రభుత్వ ఇంజనీరింగ్, మహిళా డిగ్రీ కళాశాల తోపాటు వివిధ అభివృద్ధి పనులకు సీఎం భూమి పూజ చేస్తారు. అలాగే నియోజకవర్గంలోని ఉమ్మడి ఐదు మండలాలకు సంబంధించిన ఇతర అభివృద్ధి పనులకు అక్కడే శిలాఫలకాలను ప్రారంభిస్తారు. అనంతరం మహిళా స్వశక్తి సంఘాల స్టాల్స్‌ను సీఎం పరిశీలిస్తారు. ఆ తరువాత సభలో ప్రసంగిస్తారు. ప్రొటోకాల్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్లు అధికారులను ఆదేశించారు. బారికేడ్లు, భద్రత, పార్కింగ్ వంటి వాటిపై ఇరు జిల్లాల పోలీస్ అధికారులతో చర్చించారు. సభకు వచ్చే జనానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఇరు జిల్లాల అధికారులు పాల్గొన్నారు.



వీరభద్రేశ్వర కమాన్‌ను ప్రారంభిస్తున్న ప్రసాద్‌కుమార్

మహనీయుడు బసవేశ్వరుడు

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

ధారూరు: పన్నెండవ శతాబ్దంలోనే అంటరానితనాన్ని నిర్మూలించేందుకు, మహిళల సమానత్వం కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి మహాత్మా బసవేశ్వర స్వామి అని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ధారూరులోని తాండూరు –హైదరాబాద్ ప్రధాన రహదారి పక్కన వికారాబాద్‌కు చెందిన దాత బస్వలింగ్ ఏర్పాటు చేసిన బసవేశ్వర విగ్రహాన్ని, మహమ్మదాబాద్‌కు చెందిన దాత అశోక్‌కుమార్ ఏర్పాటు చేసిన వీరభద్రేశ్వర మహా ముఖ ద్వారాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత మహనీయుల బాటలో నడవాలని సూచించారు. వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.

రూ.140 కోట్లతో కోట్‌పల్లి ప్రాజెక్టును ఆధునీకరిస్తాం

ధారూరుకు ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేయిస్తామని స్పీకర్ ప్రసాద్‌కుమార్ హామీ ఇచ్చారు. అలాగే ధారూరు, పెద్దేముల్ మండలాల పరిధిలోని 9,200 ఎకరాలకు సాగునీరందించే కోట్‌పల్లి ప్రాజెక్టును రూ.140 కోట్లతో ఆధునీకరిస్తామని తెలిపారు. రుద్రారం – నాగసముందర్ గ్రామాల మధ్య రోడ్డుపై వంతెన నిర్మిస్తామని చెప్పారు. దోర్నాల్ వద్ద కాగ్నా నదిపై అసంపూర్తిగా వంతెనను త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే వికారాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి రూ. 500 కోట్లు తెచ్చినట్లు తెలిపారు. అనంతరం జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ మాట్లాడుతూ.. బసవేశ్వరుని సేవలు మరువలేమన్నారు. ఓబీసీలను బీసీడీలో కలపాలని తాము పోరాటం చేస్తున్నామని, ఇందుకు సహకరించాలని స్పీకర్‌ను కోరారు. అనంతరం చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. మనుషులంతా ఒక్కటేనని చెప్పిన మహనీయుడు బసవేశ్వరుడని కొనియాడారు. అనంతరం ధారూరులో పూజారి చెన్నబసవయ్యస్వామి ఏర్పాటు చేసిన వివేకానందస్వామి విగ్రహాన్ని, అరుణ ప్రైవేటు ఆసుపత్రిని స్పీకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలంపల్లి కెంపిన మఠం పీఠాధిపతి డాక్టర్ చెన్నబసవ ప్రభుస్వామి, యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద పటేల్, కాంగ్రెస్ నాయకులు లాయర్ సంపూర్ణానందరావు, వీరన్న, జ్ఞానేశ్వర్, శివకుమార్, మల్లికార్జున్, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాములు తదితరులు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలు జరిగేలా చూడండి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జీవరాజ్

పరిగి: ప్రైవేటు ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జీవరాజ్ వైద్యులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని విజేత హాస్పిటల్‌ను వైద్యాధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రిలో జరిగే జననాలను కచ్చితంగా ఈ బర్త్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. అత్యవసరం అయితే తప్ప సిజేరియన్ ప్రసవాలను ప్రోత్సహించరాదన్నారు. వైద్య ఆరోగ్య శాఖ నిబంధనలను విధిగా పాటించాలని సూచించారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు పాటించకపోవడంతో ఆస్పత్రి సిబ్బందికి షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు సమాచారం. కార్యక్రమంలో వైద్యాధికారులు సాయిబాబా, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల స్థానాన్ని మోదీకి గిఫ్ట్‌గా ఇవ్వాలి

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్
- వికారాబాద్‌లో విజయ సంకల్ప యాత్ర



విజయ సంకల్ప యాత్రలో మాట్లాడుతున్న బండి సంజయ్

వికారాబాద్ అర్బన్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ స్థానాన్ని గెలిపించి ప్రధాని మోదీకి బహుమతిగా ఇవ్వాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పిలుపునిచ్చారు. బీజేపీ విజయ సంకల్ప యాత్ర మంగళవారం రాత్రి వికారాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని బీజేఆర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 80శాతం ఉన్న హిందువుల కోసం పనిచేస్తున్న బీజేపీని కేంద్రంలో మూడోసారి అధికారంలోకి తీసుకరావాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందన్నారు. దశాబ్దాలుగా బాబ్రీ మసీదు అంశాన్ని బూచి గా చూపి పబ్బం గడుపుకొన్న కాంగ్రెస్ పార్టీ, అనేక మంది కరసేవకులను పొట్టన పెట్టుకుందన్నారు. ప్రధాని మోదీ ఒక నెత్తుటి చుక్క రాలకుండ బాబ్రీ మసీదు స్థానంలో రామ మందిరాన్ని నిర్మించినట్లు తెలిపారు. 370 ఆర్టికల్ రద్దుతో నేడు కాశ్మీర్‌లో మనమంతా స్వేచ్ఛగా పర్యటించే అవకాశం లభించినట్లు తెలిపారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన ఈ తొమ్మిదేళ్లలో పది లక్షల మంది యువతకు ఉద్యోగాలు ఇచ్చి నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి లక్షల కోట్ల నిధులు ఇస్తే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ తన ఫొటోలతో ప్రచారం చేసుకున్నారని ఆరోపించారు. నేడు పేదలకు ఇస్తున్న రేషన్ బియ్యం, గ్రా మాల్లో నిర్మించిన మరుగుదొడ్లు, శ్మశానవాటికలు, క్రీడా ప్రాంగణాలన్నీ కేంద్ర నిధులతో నిర్మించినవేనని పేర్కొన్నారు. కేసీఆర్ వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి ఉంటే ఈ పాటికి కేసీఆర్, కేటీఆర్‌ను అరెస్టు చేయడం తోపాటు, ఆయన ఫామ్ హౌస్‌ను బుల్డోజర్లతో కూలగొట్టే వాళ్లమన్నారు. తెలంగాణలో బీజేపీ ఎంపీ స్థానాలు అధికంగా గెలిస్తే పెద్ద ఎత్తున నిధులు రావడంతో రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే చెల్లని ఓటుగా మారుతుందని అన్నారు. ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను అమలు చేయడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కే మాధవరెడ్డి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే రమణా రెడ్డి, బీజేపీ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, నాయకులు ప్రేమేందర్, విఠల్, ఆకుల విజయ, రాణి రుద్రమ, శివరాజ్, కేపీ రాజు, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు

- రూ.7 లక్షల కోట్లకు రూ.20 వేల కోట్ల వడ్డీ కట్టాల్సి వస్తోంది
- అర్హులందరికీ ఆరు గ్యారంటీలు అమలు చేసి తీరుతాం
- మంత్రి శ్రీధర్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

మొయినాబాద్ రూరల్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు ధ్వజమెత్తారు. హిమాయత్‌నగర్ సమీపంలోని ఓ ప్రైవేటు కన్వెన్షన్‌లో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. కేసీఆర్ చేసిన ఏడు లక్షల కోట్ల అప్పులకు.. 20 వేల కోట్ల వడ్డీ కట్టాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అర్హులైన వారందరికీ ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ప్రకటించారు. ఒకటి రెండు రోజుల్లో 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూ పాయలకు గ్యాస్ పథకాలకు శ్రీకారం చుట్టబోతున్నామని తెలిపారు. కాంగ్రెస్‌ను ఓడించడం చేతకాక బీజేపీతో పొత్తు అంటూ బీఆర్‌ఎస్ డ్రామాలు చే స్తోందన్నారు.మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే ఓర్వలేక ఆటో డ్రైవర్లతో సమ్మె చేయిస్తున్నారని దుయ్యబట్టారు. ఆటో డ్రైవర్లకు ఏటా రూ.12 వేలు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని వెల్లడించారు.పార్లమెంట్ ఎన్నికల్లో 17 స్థానాల్లో విజయం సాధిస్తామన్నారు.

హామీలకే పరిమితం..

తొమ్మిదిన్నరేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ సాధించింది ఏమీ లేదని, హామీలకే పరిమితమైందని వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. తండాలు, చిన్న గ్రామాలను జీపీలుగా ఏర్పాటు చేసి గాలికి వదిలేశారని తెలిపారు. చేసిన పనులకు బిల్లులు రాక సర్పంచ్‌లు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని స్పష్టం చేశారు. ప్రొటోకాల్ పాటించకపోవడాన్ని భరించలేకే తాను కాంగ్రెస్‌లో చేరానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి, చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జీ భీమ్‌భరత్, పీసీసీ కార్యవర్గ సభ్యులు షాబాద్ దర్శన్, జిల్లా మత్స్యకార్మిక సంఘం అధ్యక్షుడు మహేందర్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి

- మహారాష్ట్ర పౌరదేవి పీఠాధిపతి బాబుజింగ్ మహరాజ్



మాట్లాడుతున్న బాబుజింగ్ మహరాజ్

పెద్దేముల్: గోర్ బంజార బిడ్డలు భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని బంజారా సమాజ్ ధర్మగురు మహారాష్ట్ర పౌరదేవి పీఠాధిపతి బాబుజింగ్ మహరాజ్ అన్నారు. మంగళవారం ఆయన మండల కందనెల్లితండా సమీపంలో జాగో బంజారా సమాజ్ వ్యవస్థాపకుడు సురేందర్‌నాయక్, ఆయన సతీమణి రమావత్ శాంతిదేవి యాడీబాపుఘడ్ దేవస్థాన్ ఆధ్యాత్మిక కేంద్రానికి రూపకల్పన చేశారు. ప్రస్తుతం అక్కడ సేవాలాల్ మహరాజ్, మార్యమ్మ దేవాలయాలను నిర్మించారు. ఈ సందర్భంగా బాబుజింగ్ మహరాజ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ గోమాతను పూజించాలని సూచించారు. సేవాలాల్ మహరాజ్ ఆశీస్సులతో యాడీబాపుఘడ్ సేవాఘడ్ మాదిరిగా పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతుందన్నారు. కార్యక్రమంలో యాడీబాపుఘడ్ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేందర్ మహరాజ్, శాంతిదేవి తదితరులు పాల్గొన్నారు.



తాండూరు సభలో ప్రసంగిస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి

పార్టీలు మారేవారిని ప్రజలు నమ్మరు

- విలువల కోసం అధికార పార్టీనే వదిలేశా
- చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీదే విజయమని ధీమా

తాండూరు: అధికారం కోసం పార్టీలు మారే వారిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తాండూరు పట్టణంలో ప్రారంభమైన బీజేపీ విజయ సంకల్ప బస్సు యాత్రలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం రూ.9 వేల కోట్ల నిధులు ఇచ్చిందని తెలిపారు. కొట్లాడి తెచ్చుకున్న ప్రత్యేక రాష్ట్రం కేసీఆర్ కుటుంబం చేతుల్లో చిక్కి అనేక అవస్థలు ఎదుర్కొందన్నారు. రాష్ట్ర సాధన కోసం ఎంతో మంది ప్రాణ త్యాగాలు చేశారని గుర్తుచేశారు. కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనేక మంది ఉద్యమకారులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ చరిష్మా, రామ మందిర నిర్మాణంతో బీజేపీకి ప్రజల నుంచి విశేష మద్దతు లభిస్తోందని తెలిపారు. కొంతమంది నాయకులకు అధికార పార్టీల పంచన చేరడం పరిపాటిగా మారిందని ఎద్దేవా చేశారు. తానెప్పుడూ అధికారం కోసం పాకులాడలేదని, విలువల కోసం అధికార పార్టీని వీడి ప్రతిపక్ష పార్టీలో చేరానని గుర్తుచేశారు. తాండూరులోని ఓ కుటుంబం.. పార్టీ మారి చేవెళ్ల నుంచి పోటీ చేసేందుకు వస్తోందని, అలాంటి వారిని నమ్మొద్దని పిలుపునిచ్చారు. రాహుల్ బాబా.. కేసీఆర్ పార్టీలకు కాలం చెల్లిందని ఎద్దేవా చేశారు.

స్థానిక నాయకులకు పరాభవం

విజయ సంకల్పయాత్రలో తాండూరు నాయకులకు పరాభవం ఎదురైంది. నియోజకవర్గంలో ప్రజాదరణ కలిగిన వారిని సైతం వేదికపైకి ఆహ్వానించలేదు. యాత్రను ప్రారంభించిన తర్వాత బస్సులో లోకల్ లీడర్లు ఎవరూ కనిపించలేదు. సీనియర్ నాయకుడు నరేశ్ మహరాజ్ తన మద్దతుదారులతో కలిసి రోడ్డు పక్కన నిలబడ్డారు. ఇది గమనించిన పలువురు కార్యకర్తలు ప్రోగ్రాం నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జనసమీకరణ బాధ్యతలను స్థానిక నేతలకు అప్పగించకపోవడంతో కేవలం వందల సంఖ్యలో హాజరైన కార్యకర్తల మధ్యే యాత్ర పూర్తయింది.

క్లుప్తంగా

హస్తంగూటికి అక్బర్‌బాబా



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో అక్బర్‌బాబా

యాలాల: కోఆప్షన్‌ సభ్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు, యాలాల మండల కేంద్రానికి చెందిన అక్బర్‌బాబా సోమవారం రాత్రి కాంగ్రెస్‌ పార్టీలోకి చేరారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి బాబాకు పార్టీకి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ పటిష్టతతో పాటు ఎంపీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం కోసం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సొసైటీ చైర్మన్‌ సురేందర్‌రెడ్డి, సీనియర్‌ నాయకులు పేరి రాజేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అర్చకులకు వేతనాలు

కొడంగల్‌ రూరల్‌: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి, దూప దీప నైవేద్య అర్చకుల రాష్ట్ర కార్యవర్గానికి సంఘం జిల్లా అధ్యక్షుడు లోకూర్తి జయతీర్థాచారీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వేతనాలు అందడంలేదని, మంగళవారం చలో సెక్రటేరియట్‌ కార్యక్రమం నిర్వహించతలపెట్టగా సోమవారం దేవాదాయ శాఖ అధికారులు డీడీఎన్‌ఎస్‌ అర్చక రాష్ట్ర కార్యవర్గంతో జరిపిన చర్చల్లో అర్చకుల వేతనాలు అందించేందుకు కృషిచేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. మంగళవారం సాయంత్రం అర్చకులకు తమ ఖాతాల్లో వేతనాలు పడినట్లు సమాచారం అందడంతో హర్షం వ్యక్తం చేశారు. ఇందుకుగాను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, డీడీఎన్‌ఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు దౌల్తాబాద్‌ వాసుదేవశర్మ, దేవాదాయ శాఖ కమిషనర్‌కు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ఈ సందర్భంగా అర్చక సంఘం సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

టైర్‌ పేలి వాహనం బోల్తా

కందుకూరు: పుచ్చకాయలతో వెళ్తున్న బొలేరో వాహనం టైర్‌ పేలి బోల్తాపడింది. ఈ ఘటనలో అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ సంఘటన కందుకూరు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. సాయంత్రం కడ్తాల్‌ వైపు నుంచి హైదరాబాద్‌ మార్కెట్‌కు బొలేరో పుచ్చకాయల లోడుతో వెళ్తుంది. కాగా మార్గమధ్యలో మండల కేంద్రం శ్రీశైలం రహదారిపై విద్యుత్‌ సబ్‌ స్టేషన్‌ సమీపంలో ఆ వాహనం వెనక టైర్‌ పేలింది. దీంతో ఆ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. వాహనంలోని పుచ్చకాయలు రోడ్డుపాలయ్యాయి. వాహనంలోని డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తి స్వల్పగాయాలతో బయటపడ్డారు.

ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ విజయలక్ష్మి

షాద్‌నగర్‌: మహిళల ఆరోగ్య సంరక్షణకు వైద్యారోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె చించోడ్‌ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం డాక్టర్‌ విజయలక్ష్మి మాట్లాడుతూ... ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని సూచించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే మహిళలకు అవసరమైన అన్ని రకాల పరీక్షలు నిర్వహించాలని అన్నారు. రక్త నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం కొండాపూర్‌లో ఉన్న ఆస్పత్రికి పంపించాలని సూచించారు. విధి నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన చికిత్సలు అందించాలన్నారు. మహిళా ఆరోగ్య శిబిరంలో 62 మందికి పరీక్షలు నిర్వహించినట్లు, అందులో 16 మంది రక్తనమూనాలను పరీక్షల నిమిత్తం పంపినట్లు తెలిపారు. ప్రతి మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించే శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌ స్రవంతి, హెల్త్‌ ఎడ్యుకేటర్‌ శ్రీనివాసులు, హెల్త్‌ సూపర్‌ వైజర్‌ రమ, ఫార్మాసిస్టు ఉదయ్‌కుమార్‌, నర్సు సువర్ణ, ల్యాబ్‌ టెక్నీషియన్‌ రాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌ ట్రైనింగ్‌కు సర్వం సిద్ధం

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

- నేటి నుంచి తొమ్మిది నెలల పాటు ఏఆర్‌ కానిస్టేబుల్స్‌కు శిక్షణ
- వేదికైన వికారాబాద్‌ పీటీసీ



వికారాబాద్‌ పీటీసీ వద్ద స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

అనంతగిరి: ఇటీవల పోలీసు ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు వృత్తి శిక్షణ ఇవ్వనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 28 చోట్ల బుధవారం నుంచి శిక్షణ ప్రారంభం కానుంది. ఇప్పటికే అధికారులు ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశారు. వికారాబాద్‌ శిక్షణ కేంద్రంలో 9 నెలల పాటు 255 మంది ఏఆర్‌ కానిస్టేబుల్‌ అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కేంద్రంలో ఎస్పీ కోటిరెడ్డి పర్యవేక్షణలో శిక్షణకు సంబంధించిన అన్ని సదుపాయాలు కల్పించడంతో పాటు ఇన్‌డోర్‌, అవుట్‌డోర్‌ స్టాఫ్‌ అభ్యర్థులకు ఆయా విభాగాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణ కేంద్రంలో ఆసిఫాబాద్‌, రామగుండం, సిద్దిపేట జిల్లాల నుంచి ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ కొనసాగనుంది. ఉదయం, సాయంత్రం గ్రౌండ్‌ ఆక్టివిటీ, మధ్యాహ్నం తరగతి బోధన కొనసాగుతుంది. 2008లో ప్రారంభమైన వికారాబాద్‌ శిక్షణ కేంద్రంలో ఆరు బ్యాచ్‌లు పూర్తవ్వగా నేటి నుంచి 7వ బ్యాచ్‌ ప్రారంభం కానుంది. ఈ శిక్షణ కేంద్రంలో విశాలమైన ఏడు బ్యారక్‌లు, నాలుగు తరగతి గదులు, మెస్‌, లైబ్రరీ సౌకర్యం ఉంటుంది. డ్రిల్‌ ప్రాక్టీస్‌, ఫైరింగ్‌ తదితర వాటికి అన్ని హంగులతో గ్రౌండ్‌ను సిద్ధం చేశారు.

255 మందికి శిక్షణ



వికారాబాద్‌లోని పోలీస్‌ శిక్షణ కేంద్రంలో 255మంది శిక్షణ ఇవ్వనున్నాం. ఎస్పీ కోటిరెడ్డి పర్యవేక్షణలో శిక్షణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం ప్రశాంతమైన వాతావరణంలో అభ్యర్థులకు అన్ని విధాలా తర్ఫీదు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

– పీవీ మురళీధర్‌, ఏఎస్పీ, ప్రిన్సిపాల్‌, డీటీసీ

పరిగి డీఎస్పీపై ఫిర్యాదు



మానవహక్కుల కమిషన్‌ కార్యాలయం వద్ద ప్రజా సంఘాల నాయకులు

పరిగి: పరిగి డీఎస్పీ కరుణసాగర్‌పై చర్యలు తీసుకోవాలని మంగళవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రజావాణి, మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటయ్య మాట్లాడుతూ.. దోమ మండలం తిమ్మాయిపల్లి భూమి విషయంలో పోలీసులు జోక్యం చేసుకుని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. కొనుగోలు చేసిన భూమిని అధికార పార్టీకి చెందిన కొందరు కబ్జా చేసినా పట్టించుకోకపోగా బాధితుడిని ఇబ్బంది పడే మాటలు అన్నారన్నారు. బాధితులు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకుండా కబ్జాదారుల కు వత్తాసు పలుకుతున్నారన్నారని ఆరోపించారు. భూ విషయంలో జోక్యం చేసుకుంటున్న డీఎస్పీపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గోవింద్‌, చంద్రయ్య, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ..

వంటమనిషి దుర్మరణం

అనంతగిరి: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. మద్గుల్‌ చిట్టంపల్లి గ్రామానికి చెందిన దాసు(35) పట్టణంలోని మహావీర్‌ ఆస్పత్రిలో వంట మనిషిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రాత్రి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా రైల్వే బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తలకు బలమైన గాయాలవ్వడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

‘ఉపాధి’లో సిబ్బంది కొరత

- 33 గ్రామాలకు 11 మందే ఫీల్డ్‌అసిస్టెంట్లు
- పనులపై కొరవడిన పర్యవేక్షణ
- పనిభారంతో ఇబ్బంది పడుతున్న పంచాయతీ కార్యదర్శులు

దౌల్తాబాద్‌: గ్రామాల్లో వలసలను తగ్గించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా పనుల పర్యవేక్షణ తదితర పనుల నిమిత్తం గ్రామానికి ఒక ఫీల్డ్‌ అసిస్టెంట్‌ నియమించింది. మండలంలో మొత్తం 33 గ్రామ పంచాయతీలకుగాను కేవలం 11మంది మాత్రమే ఉన్నారు. దీంతో గ్రామాల్లో జరిగే ఉపాధిహామీ పనుల పర్యవేక్షణ కూలీలకు సరైన పనిదినాలు కల్పించేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఫీల్డ్‌ అసిస్టెంట్లు లేకపోవడం ఆ భారం గ్రామ కార్యదర్శులపై పడడంతో వారు ఒత్తిడికి గురవుతున్నారు. పంచాయతీ పనులతో పాటుగా ఉపాధిహామీ పనులు పర్యవేక్షణ చేయాలంటే కార్యదర్శులు ఇబ్బంది పడుతున్నారు.

సీనియర్‌ మేట్లతో కొనసాగింపు

మండల పరిధిలో 33 గ్రామపంచాయతీలుండగా నూతనంగా 13 పంచాయతీలు కొత్తగా ఏర్పడ్డాయి. ఆ గ్రామాలు ఏర్పాటై నాలుగేళ్లు పూర్తయినా నేటి వరకు ఎఫ్‌ఏలను నియమించలేదు. మేజర్‌ గ్రామ పంచాయతీ అయిన మండల కేంద్రంలోనే ఎఫ్‌ఏ లేరు. దేవర్‌ఫసల్‌వాడ్‌ ఎఫ్‌ఏ రాజీనామా చేశారు. గుండేపల్లి ఎఫ్‌ఏ మృతిచెందాడు. ఆయా గ్రామాల్లో సీనియర్‌ మేట్లతోనే పనులు కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి నూతన పంచాయతీలతో పాటుగా ఖాళీగా ఉన్న గ్రామాలకు ఎఫ్‌ఏలను నియమించి సమస్యలను పరిష్కరించాలని ఆయా గ్రామాల కూలీలు కోరుతున్నారు.

ఆదేశాలు వస్తే..

మండల పరిధిలోని 33 జీపీలకు 11మంది ఎఫ్‌ఏలు ఉన్నారు. 22 గ్రామాలకు వేర్వేరు కారణాలతో ఖాళీలు ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో సీనియర్‌ మేట్ల సహాయంతో పనులు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే అందుకు అనుగుణంగా ఖాళీలు భర్తీ చేస్తాం.

– రజినికాంత్‌, ఏపీఓ, దౌల్తాబాద్‌



జొన్న సాగు.. బహు బాగు

చెరువులు, కుంటల్లో సరిపడా నీరు లేకపోవడం, భూగర్భ జలాలు తగ్గడం, పెట్టుబడి తక్కువ, కరెంటు కోతలు, వేసవికి ముందే పంట కోతకు రావడం.. తదితరాలతో పాటుగా పంట మార్పిడి చేసినట్లు ఉంటుందని రైతులు యాసంగిలో మొక్క జొన్న సాగుకు మొగ్గు చూపుతున్నారు.

- పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ
- పంట రక్షణకు సోలార్‌ ప్యానెల్స్‌ ఏర్పాటు
- గతేడాదితో యాసంగితో పోల్చితే పెరిగిన సాగు విస్తీర్ణం



ఎన్కేపల్లిలో సాగు చేస్తున్న జొన్న

మోమిన్‌పేట: యాసంగిలో జొన్నసాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. పెట్టుబడులు, కూలీల ఖర్చు తక్కువ కావడం, స్థిరమైన ఆదాయం వస్తుందనే ఆలోచనతో అన్నదాతలు మొక్కజొన్న, జొన్న సాగుకు ఆసక్తి చూపుతున్నారు. గతంలో వానా కాలం పంట సాగు చేసేవారు.. ప్రస్తుతం ఆ సీజన్‌లో ఇబ్బందిగా మారడంతో రైతులు యాసంగి సాగుకు సమాయత్తమయ్యారు.పంటలను అడవి పందుల బెడద నుంచి రక్షించుకునేందుకు సోలార్‌ ప్యానెల్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు. మార్కెట్‌లోనూ క్వింటాలు జొన్నలకు రూ.3వేలకు పైగా ఉండడంతో సాగునీరు ఉన్న రైతులు సైతం జొన్నసాగుకు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.2,950 పలుకుతుండడంతో మార్కెట్‌లోనూ మంచి డిమాండ్‌ ఉంది.

పీఏసీఎస్‌ ఆధ్వర్యంలో కొనుగోళ్లు

మండల పరిధిలోని చీమల్‌దరి, చక్రంపల్లి, మోమిన్‌పేట, ఎన్కతల, ఎన్కేపల్లి, దుర్గంచెర్వు, వెల్‌చాల్‌, టేకులపల్లి తదితర గ్రామాలలో వానా కాలంలో జొన్న, మొక్కజొన్న పంటను విరివిగా సాగు చేస్తున్నారు. గతేడాది ప్రభుత్వ మద్దతు ధర రూ.2950లకు మోమిన్‌పేట పీఏసీఎస్‌ ఆధ్వర్యంలో కొనుగోలు చేశారు. రైతులు మార్కెటుకు తరలించకుండా.. దళారుల పాలుకాకుండా.. నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులను జమ చేశారు. ప్రభుత్వ మద్దతు ధరకు నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేయడం వల్ల ప్రస్తుత సంవత్సరం జొన్న, మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరిగింది.

ఇబ్బందులు తప్పాయి



కూరగాయాల సాగుకు పెట్టుబడులు పెరుగుతున్నాయి. జొన్న, మొక్కజొన్న సాగుకు తక్కువ పెట్టుబడితో పాటుగా స్థిరమైన ఆదాయం వస్తుంది. యాసంగిలో రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నా. పీఏసీఎస్‌ ఆధ్వర్యంలో ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయడం వలన ఇబ్బందులు తప్పుతున్నాయి.

– ఆనందం, రైతు, ఎన్కేపల్లి

ఎక్కువ దిగుబడులు



జొన్న, మొక్కజొన్న సాగుకు ఇతర పంటలతో పోలిస్తే పెట్టుబడులు తక్కువ. దీనికి తోడు వానా కాలం సీజన్‌తో పోల్చితే యాసంగిలో దిగుబడులు ఎక్కువగా వస్తాయి. నాణ్యమైన విత్తనాలను విత్తుకుంటే అధిక దిగుబడులు సాధ్యమవుతాయి. స్థిరమైన ఆదాయం సమకూరుతుంది.

– జయశంకర్‌, వ్యవసాయాధికారి, మోమిన్‌పేట

స్వయం విత్తనోత్పత్తితో అధిక దిగుబడి

వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్‌ సుధారాణి

తాండూరు టౌన్‌: రైతులు స్వయంగా విత్తనాలను తయారు చేసుకుంటే నాణ్యమైన పంట వస్తుందని, నష్టాలను నివారించుకోవడం తోపాటు అధిక దిగుబడి పొందవచ్చని తాండూరు వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్‌ సుధారాణి అన్నారు. మంగళవారం వ్యవసాయ విశ్వ విద్యాలయ విత్తన పరిశోధన, సాంకేతిక విభాగం వారి ఆధ్వర్యంలో తాండూరు వ్యవసాయ పరిశోధనా స్థానంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్‌ సుధారాణి, డాక్టర్‌ సుధాకర్‌, పలువురు శాస్త్రవేత్తలు మాట్లాడారు. జన్యుపరమైన, భౌతిక స్వచ్ఛత కలిగిన విత్తనాలను విత్తడం వల్ల పదిహేను శాతం అధిక దిగుబడి సాధించే అవకాశం ఉందన్నారు. బ్రీడర్‌ విత్తనాన్ని వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి సేకరించి ప్రత్యేక మెలకువలు పాటిస్తూ, ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో రైతులు తమ పొలంలోనే విత్తనోత్పత్తి చేయవచ్చని అన్నారు. నల్లరేగడి భూముల్లో కంది పంటను జంటసాళ్ల పద్ధతిలో సాగు చేయడం వల్ల అధిక దిగుబడి సాధించవచ్చని పేర్కొన్నారు. విత్తనోత్పత్తిలో ప్రధానంగా పొలం ఎంపిక, విత్తన సేకరణ, కేళీల ఏరివేత, సమదూరం పాటించడం వల్ల నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తి చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ రుద్రమూర్తి, శాస్త్రవేత్తలు స్వర్ణలత, సుకుమార్‌, ప్రభావతి, సుజాత, రాజేశ్వర్‌ రెడ్డి, అధికారులు, రైతులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్‌ సుధారాణి

మద్యం బాటిళ్ల స్వాధీనం

శంకర్‌పల్లి: బెల్ట్‌ షాపుపై శంకర్‌పల్లి పోలీసులు దాడి చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన మంగళవారం చోటు చేసుకుంది. డిటెక్టివ్‌ సీఐ నాగరాజు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని సంకేపల్లి గ్రామానికి చెందిన తోకల కృష్ణ కిరాణ దుకాణంలో మద్యం అమ్ముతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో కిరాణాదుకాణంపై దాడి చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. సీజ్‌ చేసిన మద్యంబాటిళ్ల విలువ రూ.13,500 ఉంటుందని చెప్పారు. కేసు దర్యాప్తులో ఉంది.

మేకల మందపై కుక్కల దాడి

మొయినాబాద్‌: మేకల మందపై కుక్కలు దాడి చేసి పది జీవాలను చంపేశాయి. ఈ సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితులు, గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన అజ్మత్‌ అర ఎకరంలో మేకల ఫాం ఏర్పాటు చేసుకున్నాడు. బక్రీద్‌ కోసం మేకలను తెచ్చి పెంచుతున్నాడు. రోజు మాదిరిగానే సోమవారం రాత్రి మేకలను ఫాంలో ఉంచి అజ్మత్‌ ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో మేకల ఫాంకు చుట్టూ ఏర్పాటు చేసిన ఇనుప జాలి కింది నుంచి కుక్కలు లోపలికి దూరి మేకలపై దాడి చేశాయి. దీంతో పది మేకలు మృతి చెందగా మరో ఐదు గాయపడ్డాయి. విషయం తెలుసుకున్న మండల పశువైద్యాధికారి హైమద్‌ ఘటనా స్థలాన్ని సందర్శించి మేకల కళేబరాలను పరిశీలించారు. సుమారు రూ.లక్ష విలువ ఉంటుందని ప్రభుత్వం రైతును ఆదుకోవాలని కోరారు.

ఐదు ఇళ్లలో చోరీ

కడ్తాల్‌: మండల పరిధిలోని గోవిందాయిపల్లి తండాలో సోమవారం రాత్రి తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని గుర్తు తెలియని వ్యక్తులు ఐదు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. తండాకు చెందిన కేతావత్‌ బిక్కు, సభవట్‌ రమేశ్‌, సభవట్‌ లాలు, కిషన్‌, నేనావత్‌ దేవేందర్‌లు ఇటీవల కుటుంబ సభ్యులతో కలిసి ఉపాధి కోసం కూలీకి హైదరాబాద్‌ వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు సోమవారం అర్ధరాత్రి ఆయా ఇంటి తాళాలను పగుల గొట్టి నగదు, బంగారం, వెండి ఆభరణాలను అపహరించారు. మరుసటి రోజు ఉదయం స్థానికులు గమనించి బాధితులకు, పోలీసులకు సమాచారం అందించారు. సభవట్‌ రమేశ్‌ ఇంట్లో మూడు తులాల బంగారు పుస్తెల తాడు, 40 తులాల వెండి చోరీకి గురైయింది. కేతావత్‌ బిక్కు, సభవట్‌ లాలు, కిషన్‌, నేనావత్‌ దేవేందర్‌ల ఇళ్లలో కూడా దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆయా ఇళ్లలో నగదు చోరీకి గురైనట్లు బాధితులు పోలీసులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ శివప్రసాద్‌, ఎస్‌ఐ వరప్రసాద్‌ తండా చేరుకుని గ్రామస్తులను, బాధితులను అడిగి వివరాలు సేకరించారు. క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు గుర్తించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆక్రమణలకు అడ్డుకట్ట వేద్దాం

- ప్రభుత్వ భూములను కాపాడుకోవడం మన బాధ్యత
- వికారాబాద్‌ ఆర్డీఓ విజయకుమారి
- తుంకుల్‌గడ్డలో కొత్త ఇళ్లకు అనుమతులు ఇవ్వొద్దని ఆదేశం
- అధికారులు, రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ విజయకుమారి

పరిగి: తుంకల్‌గడ్డలో ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడుకోవడం మన బాధ్యత అని ఆర్డీఓ విజయకుమారి అన్నారు. మంగళవారం పట్టణంలోని తహసీల్దార్‌ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు, ఆయా పార్టీల నాయకులతో ప్రభుత్వ భూములపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తుంకల్‌గడ్డలోని సర్వే నంబర్‌ 537లో 330 ఎకరాల అసైన్డ్‌ భూమి ఉందన్నారు. అందులో 119 ఎకరాలు రైతులకు ఇచ్చామని తెలిపారు. మరో 50 ఎకరాలు పేదల ఇళ్ల కోసం ఇచ్చినట్లు వివరించారు. 30 ఎకరాలు ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించినట్లు చెప్పారు. మిగిలిన భూమి అన్యాక్రాంతం అవుతోందని, అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. ఇష్టానుసారంగా ఇళ్లు కట్టుకుంటూ పోతే ప్రభుత్వ అవసరాలకు సెంటు భూమి కూడా మిగలదన్నారు. రెవెన్యూ, మున్సిపల్‌ అధికారులు పోలీసు అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. తుంకల్‌గడ్డ సర్వే నంబర్‌ 537లో ఎంత మంది నివాసం ఉంటున్నారు, గతంలో ఎంత మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు, ఎంత మంది కబ్జా చేశారు వంటి పూర్తి వివరాలు సేకరించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. మున్సిపల్‌, రెవెన్యూ అధికారులు ఆరు టీంలుగా ఏర్పడి ఇంటింటికి వెళ్లి సర్వే చేయాలన్నారు. పూర్తి సమచారం వస్తే ఎంత మేర భూమి ఆక్రమణకు గురైందో తెలుస్తుందన్నారు. ఇల్లు ఎప్పుడు కట్టారు, ఎన్నాళ్ల నుంచి నివాసం ఉంటున్నారు, వారి కుటుంబ స్థితిగతులు తెలుసుకోవాలన్నారు. ఇకపై తుంకల్‌గడ్డలో కొత్త నిర్మాణాలు చేపట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్‌ కనెక్షన్‌ కోసం ఇచ్చిన ఇంటి నంబర్‌ ఆధారంగా విద్యుత్‌, మున్సిపల్‌ అధికారులు సర్వే చేయాలన్నారు. గొడవలు జరిగే అవకాశం ఉంటే పోలీసుల సహకారం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ భూమికి కాపాడటం ద్వారా మునుముందు సమాజానికి ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. ఆక్రమణలను ఉపేక్షించరాదని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ ఆనంద్‌రావు, మున్సిపల్‌, మండల పరిషత్‌, విద్యుత్‌ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆలయ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

- దేవాలయ భూముల పరిరక్షణ స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌ అనిత
- ఆలయ భూములకు సర్వే చేసి హద్దురాళ్ల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్‌..



ఆలయ భూమిలో ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కడ్తాల్‌: ఆలయ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని దేవాలయ భూముల పరిరక్షణ స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌ అనిత హెచ్చరించారు. మండల కేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయానికి 40 ఎకరాలకు పైగా భూమి ఉంది. ఈ భూమి పలుచోట్ల ఆక్రమణలకు గురైంది. మూడేళ్లుగా పలుమార్లు సర్వే చేసినా అధికారులు సర్వేల్లో వ్యత్యాసం వస్తోంది. సమీప పొలాల యజమానులు అభ్యంతరంతో సర్వే తరచూ వాయిదా పడుతోంది. దీంతో విలువైన ఆలయ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. ఈ నెల 2న ‘సాక్షి’ దినపత్రికలో ‘ఆయల భూములకు రక్షణేది’ శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు మంగళవారం దేవాలయ భూముల పరిరక్షణ స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌ అనిత, తహసీల్దార్లు హరిత, విజయలక్ష్మి, ఈఓలు మోహన్‌రావు, స్నేహలత ఆలయ అభివృద్ధి కమిటీ, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో సర్వే నెంబర్‌ 120, 125, 130లలో అన్యాక్రాంతమైన ఆలయ భూములకు సర్వే నిర్వహించారు. సర్వే నెంబర్‌ 125, 130లలో హద్దులు నిర్ధారించారు. ఆక్రమణలు తొలగించి, ఆలయ భూమికి సంబంధించిన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. సర్వే నెంబర్‌ 120లో మరో రెండు రోజుల్లో సర్వే పూర్తి చేసి హద్దులు నిర్ధారిస్తామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా దేవాలయ భూముల పరిరక్షణ స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌ అనిత మాట్లాడుతూ.. ఆలయ భూమిలో ప్రైవేట్‌ వ్యక్తులు ఏర్పాటు చేసుకున్న రోడ్డును జేసీబీతో తొలగించామన్నారు. మూడు చోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. హద్దులను, బోర్డులను ఎవరైనా తొలగిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్‌ ఆంజనేయులు, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌ లక్ష్మీనర్సింహారెడ్డి, సింగిల్‌ విండో డైరెక్టర్‌ వెంకటేశ్‌, నాయకులు మల్లేశ్‌గౌడ్‌, శాయిరెడ్డి, రాఘవేందర్‌, ఎగిరిశెట్టి బాబు, బీక్యానాయక్‌, దేవదాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేధిస్తే షీటీంకు కాల్‌ చేయండి

వివరాలు గోప్యంగా ఉంచుతాం

- రాచకొండ డిప్యూటీ కమిషనర్‌ ఉషావిశ్వనాథ్‌

ఇబ్రహీంపట్నం: ప్రేమ పేరిట అబ్బాయిలు అమ్మాయిలను వేధిస్తున్నారని.. ప్రేమించకుంటే దారుణాలకు ఒడిగడుతున్నారని రాచకొండ డిప్యూటీ కమిషనర్‌ టి.ఉషావిశ్వనాథ్‌ అన్నారు. మహిళలు, విద్యార్థినులు, ఆడ పిల్లలపై జరుగుతున్న దారుణాలపై రాచకొండ పోలీస్‌ కమిషనరేట్‌ మహిళా భద్రత విభాగం, నేషనల్‌ సర్వీస్‌ స్కీం ఆధ్వర్యంలో మంగళవారం గురునానక్‌ విద్యాసంస్థలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అమ్మాయిల ఫొటోలు, వీడియోలు సోషల్‌ మీడియాలో వైరల్‌ చేస్తూ అల్లరిపాలు చేయడం పరిపాటయిందన్నారు. అమ్మాయిలు తల్లిదండ్రులకు చెప్పుకోలేని దుస్థితి నెలకొందన్నారు. తల్లిదండ్రులకు సమస్య వివరిస్తే సరైన నిర్ణయాలు తీసుకోవచ్చని సూచించారు. ప్రేమ విషయంలో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అపాయంలో ఉన్నప్పుడు షీటీంకు సమాచారం ఇవ్వాలని.. వారి వివరాలను గోప్యంగా ఉంచి తగిన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. తల్లిదండ్రులు పిల్లల సమస్యలు, పరిస్థితులను అర్థం చేసుకుని పోలీసుల సహకారం తీసుకోవాలని సూచించారు. అనంతరం రాచకొండ అసిస్టెంట్‌ కమిషనర్‌ ఆఫ్‌ పోలీస్‌ జి.వెంకటేశం మాట్లాడుతూ.. మహిళలపై నేరాలను తగ్గించేందుకు దిశగా మహిళా పోలీస్‌ విభాగం, షీ టీంలు ఎంతో సహకరిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గురునానక్‌ విద్యాసంస్థల వైస్‌ చైర్మన్‌ గగన్‌దీప్‌సింగ్‌ కోహ్లి, ఎండీ హెచ్‌ఎస్‌ సైనీ, డైరెక్టర్‌ వెంకటరావు, ప్రిన్సిపాల్‌ శ్రీనాథ్‌రెడ్డి, జాయింట్‌ డైరెక్టర్‌ పార్థసారథి పాల్గొన్నారు.